"బామ్మా! మంచినీళ్ళు కావాలి!"

మనవడు గోపీ పిలుపుతో ఉలిక్కిపడి లేచింది పార్వతమ్మ. మగతగా అప్పుడే వస్తున్న నిద్రతెర మళ్ళీ విడిపోయింది.

"ఇస్తా మందు బాబూ!" మెల్లిగా లేచి వెళ్ళి, కూజాలో మంచినీళ్ళు గ్లాసులో వంచి తెచ్చి ఇచ్చింది. తాగి నిద్రపోయాడు గోపీ. గ్లాసు బల్లమీద ఉంచిందే గానీ, అక్కణ్ణించి అడుగు వెయ్యలేక పోయిందామె.

రాత్రిళ్ళు కూడా తనను వదిలి ఉండని ఈ గోపి గాడు రేపటినించి ఎలా ఉంటాడు తనను వదిలి? తను ఎలా ఉండగలదు వాడు లేకుండా? ఎవ్వరూ లేకుండా ఎలా కాలం గడుస్తుంది? కొడుకు రామం, కోడలు లక్ష్మి, వాళ్ళిద్దరితోబాటు ఈ గుంట వెధవ వెళ్ళిపోతే, ఇల్లు బావురుమంటూంటే తాను భరించ గలదా?

హఠాత్తుగా ఆమె కొక ఊహ కలిగింది. పోనీ తామూ వాళ్ళతోబాటు వెళితే?

ఆలోచన రావటమే తడవుగా పార్వతమ్మ భర్త మంచంవేపు నడిచింది.

మంచి నిద్రలో ఉన్నందుకు గుర్తుగా విశ్వనాథం గురక పెడుతున్నాడు.

"ఏమండీ!" మెల్లిగా పిలిచింది పార్వతమ్మ.

కొద్దిగా కదిలి, నిద్ర మత్తులోనే, పూర్తిగా కళ్ళు తెరవకుండా "ఏమిటే?" అన్నారాయన.

"మనం కూడా మన రామంతో, లక్ష్మితోబాటు వెళదామండీ!" నసుగుతూ అంది పార్వతమ్మ.

విశ్వనాథం నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

"ఏమిటే నువ్వంటున్నది? మతిగాని పోయిందా?"

"లేదు. మనమూ వాళ్ళతోబాటు వెళదామంటు న్నాను. సర్దవలసిన సామానూ ఆట్టే లేదు కూడాను!"

మరు నిమిషంలోనే ఆమె తన ఆలోచనకు రూపం కల్పించేలా తొందరతో చివాలున లేచి కూర్చున్నా రాయన.

"పిచ్చి ఆలోచనలు చెయ్యక! ఇల్లూ, వాకిలీ వదిలి మన మెక్కడికి?" ఎంత శాంతంగా చెప్పినా ఆ కంఠ స్వరంలో కటుత్వమే గోచరించింది.

"చూడండి! కుర్ర వెధవ! అస్తమానం 'బామ్మా, బామ్మా!' అంటూ కొంగు పట్టుకు తిరుగుతూంటాడు. నేను పక్కన లేంది నిద్ర కూడా పోడు! రేపటి నించి వీడు లేకుండా నేనెలా బతకగలను! వాడూ దిగులుపడడూ? పైగా మన రామాన్ని వదిలి నేనుండ లేనండీ!" చివరి మాటలతో ఆమె కంఠం బొంగురుపోయింది.

భార్య వాలకాన్ని గమనిస్తున్న విశ్వనాథం గారికి ఆమె పరిస్థితికి జాలి కూడా కలిగింది.

"పిచ్చిదానా! ఎంత అంటుకు తిరిగినా, గోపి వాళ్ళ అమ్మా నాన్నలను వదిలి క్షణమైనా ఉండగలడా? ప్రవాహం ఎప్పుడూ కిందికి ప్రవహిస్తుందే గానీ, పైకి, వెనక్కి మళ్ళుతుందా? మా అమ్మా నాన్నలు కూడా నన్ను వదిలి క్షణం ఉండగలిగేవారు కాదు. కానీ, వాళ్ళు వచ్చారా మన వెంట? వాళ్ళ కోసం మనం మన దారిని నిరోధించుకున్నామా ఆనాడు? ఊరికే లేనిపోని ఆలోచనలు పెట్టుకుని దిగులుపడటం నీ కలవాటైపోయింది."





విశ్వనాథంగారు దుప్పటి బిగించేశారు.

ఎంత నెమ్మదిగా చెప్పినా, వారి మాటల్లోని మంద లింపు పార్వతమ్మకు అర్థం కాకపోలేదు. మరీ ఆయన అన్న చివరి మాటలు ఆమెను కలవరపరిచాయి కూడా! గతస్మృతు లెన్నో గబగబా దృశ్యాలుగా ఆమె కళ్ళ ముందు మెదలటం మొదలుపెట్టాయి. వద్దు అను కున్నా మనస్సు గత జీవితానుభవాల్ని తవ్వి తీస్తూంది.

* * * *

గోరింటాకు కడిగేసుకుని, చేతులు ఎర్రగా పండా యని మురిసిపోతూ, అందరికీ తన చేతులు చూపించా లనే ఆత్రంతో గబగబా పరిగెత్తుతున్న పన్నెండేళ్ళ




## స్త్రీ

పార్వతి, పరికిణీ అడ్డుపడి బోర్లా పడింది గుమ్మం దగ్గర.

"భలేగా పడ్డావే, పారూ! మరోక్కసారి పడమ్మా, చూస్తాను." అంటూ చప్పట్లు చరుస్తున్న రామకృష్ణ అన్నయ్యతో (శుతికలిపి నవ్వింది పక్కింటి శారద.

పార్వతికి ఉక్రోషం ముంచుకు వచ్చింది. తను పడ్డందుకు కాదు, అన్నయ్యతోబాటు శారద నవ్వినందుకు! అసలా శారద కెంతో గర్వం. క్లాసులో తనకంటే ఎక్కువ మార్కులు వస్తాయని అహంభావం. తను అందంగా ఉంటుందని అపోహ. ఇలా ఎన్నెన్నో శారదను గురించి కసిగా అనుకున్నా మనస్సు ఊరట చెందలేదా రోజు.

మరోకసారి స్కూల్లో పార్వతికి తక్కువ మార్కులు వచ్చాయని టీచరు సున్నితంగా చీవాట్లు వేసినప్పుడు కూడా ఇలాగే నవ్వింది శారద. ఇంటికి రాగానే, పుస్తకాలు గిరవాటేసి అలిగి కూర్చున్న పార్వతిని ఎన్నో విధాల అనునయించింది తల్లి. సంగతి తెలిసి, తేలిగ్గా నవ్వేసిం దావిడ.

"ఓహ్! ఇంతేగదా? ఈసారి బాగా చదివి, శారద కంటే మంచి మార్కులు తెచ్చుకో! అప్పుడు నువ్వు పెద్దగా నవ్వచ్చు!" అంది.

ఆ సలహా ఎంతో నచ్చింది. అహర్నిశలూ అవస్థపడి శారదకంటే ఓ నాలుగు మార్కులు ఎక్కువ సంపాదించేసరికి తాతలు దిగి వచ్చారు. అప్పట్లో పార్వతికి అది ఒక్కటే సమస్య. స్కూల్లో తనే ఫస్టు మార్కు తెచ్చుకోవాలి. అందరూ తననే మెచ్చుకోవాలి.

"ఆడపిల్ల కామాత్రం చదువు చాలు!" అనే బామ్మ సిద్ధాంతానికి అమ్మ, నాన్న తలవంచక తప్పలేదు. ఫోర్తు ఫారమ్ పాస్ అయిందనిపించింది ఇంతా చేసి.

ఇంతకుముందులా అమ్మ తనను ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళనివ్వటం లేదు. ఇది మరీ బాధయిపోయింది. అస్తమానం ఇంట్లో కూర్చుని అల్లికలూ కుట్లూ చేస్తున్నా విసుగు వేస్తోంది. రామకృష్ణయ్య చెప్పే చదువుకంటే, మొట్టికాయలే ఎక్కువపాలు కావటంతో ఇంటి దగ్గిర చదువుకు తనే స్వస్తి చెప్పింది పార్వతి. ఎవరేనా తెలిసిన మగవాళ్ళు వస్తే, చనువుగా పలకరిస్తే కేక లేస్తోంది అమ్మ. పైగా అదేమిటో తనకూ కాస్త బెరుకుగానే ఉంటోంది.

తరుచుగా తన అందచందాల్ని గురించి, తన పెళ్ళిని గురించి ప్రసక్తి వస్తోంది ఇంట్లో పెద్దల మధ్య. నిజంగానే ఏదో అందం కొత్తగా అవరించినట్లు పార్వతి కూడా గమనించకపోలేదు. వివాహాన్ని గురించిన అస్పష్టపు ఆలోచనలేవో గజిబిజిగా అల్లుకుంటున్నాయి హృదయంలో. పెళ్ళిచూపుల తంతు కూడా జరుగుతూంది అప్పుడప్పుడు. ప్రతి ఒక్కరి ముందుకు తనను బాగా అలంకరించి, తీసుకువెళ్ళి కూర్చోబెడుతూంటే చిరాకూ, కోపమూ కూడా కలుగుతున్నాయి పార్వతికి. కానీ, ఆ తరవాత రాబోయే ఫలితాన్నిగూర్చి, కుతూహలంగా ఎదురుచూడటంతో ఆ చిరాకు మాయమైపోతూంది. ఆ ఊహా చిత్రం వాస్తవ రూపం ధరించింది.

జాగ్రత్తగా వ్రాసి ఇయ్యి. దాచి ఉంచుతాను. మళ్లీ ఎప్పుడేనా 'స్త్రీ బానిసగా జన్మిస్తుందా?' వగైరా ప్రశ్నలు వేసినప్పుడు పీకే ఇస్తాను" అనేశారాయన నవ్వుతూ!

దీపావళి వారం రోజులున్నదనగా, పిలుచుకువెళ్ల డానికి అన్నయ్య వచ్చాడు.

"ఇప్పుడే స్తిమిత పడ్డాం, అన్నయ్యా! ఇంతలోనే నేనక్కడికి వస్తే, పిల్లలకు చదువు పోతుంది. ఆయనకు హోటలు భోజనం బొత్తిగా పడదు. మరోకసారి వీలు చూచుకు వస్తాంలే, అన్నయ్యా!" అంది పార్వతమ్మగా నామాంతరం పొందిన పార్వతి.

ఆశ్చర్యంగా చెల్లెలివేపు ఒకసారి చూచి, "ఏం ఆడ వాళ్లో మీరు!" అనేశాడు అన్నయ్య.

అవును మరి. పిల్లలూ, భర్తా ఆ స్వర్గాన్ని వదిలి ఎక్కడికి వెళ్లగలదు తను? ఇంతకంటే ప్రపంచంలో ఆత్మీయు లెవరున్నారు? ఆ ఆలోచన తనకే ఆశ్చర్యం కలిగించింది. స్త్రీ ఎంత స్వార్థపూరితురాలు! ఒకప్పుడు, అత్తవారి ఇంట్లో ఉండగా, ఎప్పుడు అన్నయ్య వస్తాడా? ఎప్పుడీ నరకంలోనుంచి కొంత కాలం తప్పించుకుపోదామా? అని ఉబలాట పడు తూండేది. కానీ ఈనాడు?

పిల్లలు ముగ్గురూ పెద్దవాళ్లయ్యారు. ఒక్కొక్క సారి వాళ్ల అభిప్రాయాలు పార్వతమ్మకు బొత్తిగా నచ్చటం లేదు. అడ్డు వస్తే వాళ్లు విసుక్కుంటున్నారు. అభిమానం ముంచుకువస్తుంది. ఇంతగా కష్టపడి కని పెంచిన తల్లిని, బిడ్డలు ధిక్కరిస్తున్నారనే బాధతో కాస్సేపు మౌనం వహించినా, అంతలోనే అనురాగం పెల్లుబికి మళ్లీ అది మరిచిపోతుంది పార్వతమ్మ. శంకరం పెళ్లి అయి, భార్యాభర్త లిద్దరూ, తమకు చాలా దూరంలో ఉంటున్నారు. అక్కడ శంకరానికి ఉద్యోగం. అమ్మాయి సీతకూ పెళ్లి అయి, అదీ దానిభర్తా కూడా చాలా దూరాన ఉంటున్నారు. శంకరం, వాడి భార్య, సీత, దాని భర్త ఎప్పుడో చుట్టపు చూపుగా వచ్చి వెడతారు నాలుగురోజులు. అంతే. ఇక రామం. ఏడేళ్లుగా దగ్గిర ఉన్నది రామం, లక్ష్మి ఇద్దరే. మనవడు గోపి.

రేపు వీళ్లూ వెళ్లిపోతారు.

"బామ్మా! చలేస్తోంది!" మనవడి నసతో మళ్లీ ఇహలోకంలోకి వచ్చింది పార్వతమ్మ.

"దుప్పటి కప్పుతానుండు, నాన్నా!"

నిద్రపోతూ కూడా తనను గట్టిగా వాటేసుకుని పడుకున్నాడు క్షుర నాగన్న.

పార్వతమ్మకు అనుకోకుండా, కోడలు లక్ష్మి జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ అదే ఒత్తిడి చేసి రామాన్ని ఇలా ప్రయాణం చేయించటం లేదుకదా? ఛ. ఏమిటీ ఆలోచన? ఒకప్పుడు తననూ అందరూ ఇలాగే అన్నారు. వెంటనే పార్వతమ్మ మనస్సులో ఏదో పొర తొలగినట్లయింది. అవును, లక్ష్మికూడా తనలాగే ఆడదే! ఒకవేళ ఆ అమ్మాయికి ఎన్నో తీయని కోరికలు ఉండి ఉండవచ్చు. అత్తగారి పదవి రాగానే స్త్రీ సహజమైన అధికార దర్పం తనలోనూ వచ్చేసింది. లక్ష్మి వయస్సులో, దాని అభిప్రాయాలూ, అలంకరణలూ, పనులూ ఒకటేమిటి— లక్ష్మి ఏది చేసినా తనకు దానిలో ఏదో లోపం కనపడటమూ, తను విసుక్కోడమూ కూడా ఎక్కువైపోయాయి. అస్తమానం లక్ష్మిలో లోపాలెంచి సాధించటమే తనకు ముఖ్యమైన పనిగా మారింది. రామం అంతా తండ్రి పోలిక. ఏదీ పట్టించుకోడు.

ఛ . . . . తనెంత దిగజారిపోయింది! ఎంత పొరబాటు జరిగింది! ఇన్నాళ్లూ లక్ష్మిని గురించి తానూ ఓ స్త్రీగా ఏ నిమిషమూ ఆలోచించనేలేదు. కోడలి కోరికలను గురించిగాని, తాను కోడలుగా ఉన్న రోజులను గురించిగానీ తలచలేదు కూడా. ఒకటి రెండుమార్లు రామం, తమకు దూరంగా ఉద్యోగానికి ప్రయత్నిస్తే, ఎన్నో విషాదాలు పలికింది. "కొడుకు మీద ప్రేమ" అనే సాకుతో వాళ్లను నిలిపివేసింది. అంతేకానీ, ఒకప్పుడు తాను అనుభవించిన నరకం లాంటిదే తన కోడలికి కూడా తాను తయారు చేసి పెట్టాననేది తెలుసుకోలేక పోయింది.

పార్వతమ్మ కళ్లు చెమ్మగిల్లాయి. చివరకు నిన్న కూడా రామాన్ని ఆపటానికి ఎంతో హంగామా చేసింది! ఎంత పిచ్చిపని చేసింది! పశ్చాత్తాపం నిండి, కొడుకూ కోడళ్లమీద వాత్సల్యం పెల్లుబికింది పార్వతమ్మలో! నిండుమనస్సుతో ప్రయాణానికి అంగీకరిస్తూ, ఇందాకా డోలాందోళనగా ఉన్న హృదయాన్ని వివేకంతో సమాధానపరుచుకొంది ఆమె.

ఒక్కసారిగా, ఒకసారి తను భర్తను అడిగిన ప్రశ్నకు అస్త సమాధానంగా ఆయన చెప్పిన సమాధానం గుర్తుకు వచ్చింది:

"స్త్రీ జీవితమే ఒక వింత, పార్వతీ! అనురాగమూ, త్యాగమూ, దుఃఖమూ, సహనమూ, అవమానమూ, స్వార్థమూ, పరార్థమూ, వీటన్నిటి సమ్మిశ్రిత స్వరూపమే స్త్రీ!"

కొడుకూ, కోడలూ, మనవడూ కూర్చుని వెళు తూన్న బండి కనుచూపుమేర సాగిపోయేవరకూ చూస్తూ అల్లాగే నిల్చుండిపోయింది పార్వతమ్మ. కళ్లలో నిండుగా నిలిచి ఉన్న నీళ్లలో, ఆవేదనా, ఆనందమూ కూడా తొణికిసలాడుతున్నాయి. బండిని సాగనంపి తిరిగి వచ్చిన విశ్వనాథంగారు, నిశ్చలంగా నిల్చుని ఉన్న భార్యను చూచి నివ్వెరపోయారు.

బాల్యంలో ఆమె ఊహలు వేరు. యౌవనంలో ఆమె కోరికలు వేరు. మాతృత్వం లభించిన తర్వాత ఆమె ఆలోచనలు వేరు. జీవితంలో పరిపూర్ణత సిద్ధించిన తరవాత ఆమె అభిప్రాయాలు వేరు. ఇప్పుడు వృద్ధాప్యంలో ఆమె ఆకాంక్ష వేరు. నిశ్చలంగా నీరు నిండిన ఆ స్త్రీమూర్తి కళ్లలో ఉన్న ఆలోచన ఒక్కటే. అభిప్రాయం ఒక్కటే. ఆకాంక్ష ఒక్కటే. ఎక్కడ ఉన్నా తన బిడ్డలు సుఖంగా, సంతోషంగా, ఆయు రారోగ్యైశ్వర్యాభివృద్ధులతో కలకలలాడుతూండాలి అంతే! ★

# పైటచాటు చాన

## శార్వరి

మొన్న కలలోన కన్పించినావు దేవి!
వేడి నిట్టూర్పుతో నా కల కరిగిపోయె.
వెదకి వేసారినాను నీ కొరకయి
ఉభయ సందెల రాగరక్తిమలలోన.
ఎన్నొ పథాల పర్వులెత్తితిని గాని
అతివ! నీజాడ లేశమాత్రమ్ము లేదు.
కడకు కడలిని చేరి కన్నీరు పెట్ట
అలలపై సకియ! నీవు కన్పించినావు.
అలసిపోయిన నీపాద పల్లవములు
సోక నా హృది కన్నీరు కార్చె.
దేవి! కనలిన నీదు చెక్కిళుల చూచి
గులాబు లెక్కడి వని భ్రమించి నాను.
అవట అరవిచ్చు గులాబీలు కూడ
నీ పెదవి రంగు లద్దుకొనుగాదె!
ఏది నీ నెలవు సెలవీయరాద
గాలి కెరటాలపై నీదుకొని వత్తు.
ఇట్టె కనుపింతు, వప్పుడె మాయమగుదు
వేల, నాసిడ సోకరాదేమి బేల!
వెలుగుదారుల నీవు కన్పించవేని
చీకటిని ఆశ్రయింతు బికారివోలె
చీకటిని చీల్చి గుండెల దారులంట
పరుగు లిడివచ్చు విద్యుల్లతవు నీవు.
స్మరణ మాత్రాన కన్నుల నిల్చు నీవు
ఎదుటపడ ఏల సంశయింతు పిరికి?
మొన్ననొకమారు నీపైన విసిగి

నన్ను నేనె శపించుకొన్నాడ తుదకు.
అయిన నేమాయె, శాపవశాన కూడ
కన్నుమూయగ నీవె కన్పించినావు.
ఎంద రెందరు సుందరాంగినులు లేరు
కాని కనికరించి వాలొక్కరైన రారె!
ఏ మగనాలి గాని కన్పించెనేని
పదము లంటి కన్నుల కద్దుకొందు.
దేవి, నీ హృదయాలయమ్ము ముదల
వేచి యుందున జీవితాంతమ్ము వరకు?
ఈ కవాటమ్ము లేల బంధించినావు
తెరిచెడి ప్రేమబీగమ్ము నావద్ద నుండ!
ఏమి గాని, నీవునొక అబలవె సుమ,
బలము నీయెడ నిష్ఫలము నిజము.
దేవి! నీ కడగంటి చూపు చాలు
వేయి జన్మలు పరవశించుటకు నాకు.

ఏల, ముద్దీయ ముందునకు రాక
మూతి తిప్పుదు, ముక్కెరేల అడ్డు?
ఒక్క కౌగిలి చాలు, కరుణింతువేని
మళ్లి జన్మముదాక నీవైపు జూడ.
ఏల ముసి ముసి నవ్వెదవు దేవి
కెంపు పలువరున జారిపోదు లెమ్ము.
ఒత్తి పసివాడః వీనికేల ప్రణయ
మని పైట చాటుచేసుకొనకు చాన! •